నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, మంగళవారం 24 డిసెంబర్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

- సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
- జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీఎం హామీని నిలబెట్టుకోవాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 23: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జనగామ కలెక్టరేట్ వద్ద 14వ రోజు కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష శిబిరానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై బీఆర్ఎస్ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జీవో నంబర్ 16ను పునరుద్ధరించి ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. 14 రోజులుగా ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని, విద్యా శాఖకు మంత్రి కూడా లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో 16 ప్రకారం వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేశారన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్స్‌ను వినడానికి కూడా ఈ ప్రభుత్వం సమయం ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వా నికి దున్నపోతు మీద వానపడ్డట్లే ఉందని ఎద్దేవా చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరాటంలో తన వంతు కృషితో పాటు బీఆర్ఎస్ మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మాజీ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ తాళ్ల సురేశ్ రెడ్డి, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, నీల యాదగిరి, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, యాకూబ్‌పాషా, రాజ్‌కుమార్ రోడ్రిక్స్, పానుగంటి ప్రవీణ్, కన్నారపు వంశీకృష్ణ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవీందర్ రెడ్డి, గోరంట్ల యాదగిరి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు, పక్కన ఎమ్మెల్యే మురళీనాయక్

పేదలకు కనీస సౌకర్యాలేవి?

- బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన పోరాటం చేస్తది
- ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి
- మెడికల్ కళాశాలకు వసతులు కల్పించాలి
- సమస్యలపై అడిషనల్ కలెక్టర్‌కు పట్టింపులేదా?
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు
- గరంగరంగా మానుకోట మున్సిపల్ సమావేశం

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 23 : మానుకోట మున్సిపాలిటీ శివారు కాలనీల్లో నివసిస్తున్న పేదలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. సోమవారం మహబూబాబాద్ పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వార్డుల్లో చెత్త బండి తిరగకపోవడంతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, వెంటనే వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, నూతన మున్సిపల్ భవనాన్ని ప్రారంభించాలని కౌన్సిలర్లు లేవనెత్తిన పలు అంశాలపై సమావేశం గరంగరంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి, సరిపడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చేసిందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారించాలన్నారు. సమావేశానికి అధికార పార్టీ ఎమ్మెల్యే వచ్చి స్థానిక సమస్యలపై సుదీర్ఘ చర్చ జరుగుతున్నప్పుడు అడిషనల్ కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలన్నారు. నూతన మున్సిపల్ చట్టం ప్రకారం అన్ని అధికారాలు ఆయనకే ఉన్నాయని, కౌన్సిలర్ల సమస్యపై ఆయన పట్టింపు లేకుండా ఉంటే ఎట్లా అని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలో అరకొర వసతులతో మెడికల్ కాలేజీ నిర్మించి విద్యార్థుల ను ఇబ్బందులకు గురి చేసిందని, వారి హయాంలో ప్రజలు కష్టాలు పడ్డారని ఎమ్మెల్యే మాట్లాడుతున్న క్రమంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు జోక్యం చేసుకుని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్ర భుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిందని, అన్ని రకాల వసతులను సమకూర్చాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. సంవత్సరం కాలం గడిచినా ఒక్క రూ పాయి రాలేదని, అభివృద్ధి ఎలా జరుగుతదని, కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విశాలమైన రోడ్లు, ఇంటింటికి నల్లా, ఉచిత విద్యుత్‌ను ఇచ్చిందని చెప్పారు.

నల్లబెల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

పీఎం కిసాన్ అమలుకు రేవంత్ యత్నం

- ఆంక్షలు పెట్టి రైతుబంధును కుదించడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యం
- బాకీ ఉన్న రెండు విడుతల పెట్టుబడి సాయం ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు పోవాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, డిసెంబర్ 23: రాష్ట్రంలో పీఎం కిసాన్‌ను ప్రవేశపెట్టేందుకు రేవంత్ సర్కారు కుటిల యత్నం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఆశగా ఎదురు చూస్తున్న అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపెట్టిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు ఎదురు చూడకుండానే పంట పెట్టుబడి సాయం అందజేసిందని, ఇప్పటికే రెండు సార్లు రైతుబంధుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టిందన్నారు. కమిటీల పేరుతో ఐదుగురు మంత్రుల బృందం రాష్ట్రంలో పర్యటించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పంట పెట్టుబడిపై విధి విధానాలను ఖరారు చేయకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ సర్కారు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,700 పైచిలుకు రైతులకు రైతు బంధు ఇవ్వగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 3,81, 890 మంది రైతులకు రైతుబంధును కుదించే కుట్రలు సరైంది కాదన్నారు. జిల్లాలో 2.40 లక్షల టన్నుల ధాన్యం వస్తే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 90 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. మిగిలిన ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయలేదో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితోపాటు కలెక్టర్, అదనపు కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామన్నా పీపీసీఈ సెంటర్‌లో రైతులు ఎందుకు విక్రయించలేదో స్పష్టం చేయాలన్నారు. ప్రధానంగా ప్రాంతీయ సహకార సంఘా లను నిర్వీర్యం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి రైతుకు చెందిన అన్ని ఎకరాలకు రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు లేనిపోని సాకులతో ఒక్క పంటకు రైతు బంధు వేసి చేతులు దులుపుకుంటామంటే కాంగ్రెస్ సర్కారు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం బాకీ ఉన్న రెండు పంటలకు ఎకరానికి రూ. 15,000 లెక్కన రెండు విడు తలకు రూ. 30,000లు రైతు భరోసా బాకీని చెల్లించాకే స్థానిక ఎన్నికలకు పోవాలన్నారు. లేదంటే కాంగ్రెస్ సర్కారును ప్రజల్లో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సన్నద్ధమవుతుందని హెచ్చరించారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మళ్లీ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే నియోజకవర్గంలో విడుదల చేసిన రూ. 75 కోట్ల నిధులు ఎక్కడికి వెళ్లాయో సంబంధిత మంత్రి వెల్లడించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, పాలెపు రాజేశ్వర్‌రావు, కొత్తపెల్లి కోటిలింగాచారి, గందె శ్రీనివాస్‌గుప్తా, రాజారాం, గుమ్మడి వేణు, మామిండ్ల మోహన్‌రెడ్డి, హింగ్లి శివాజీ పాల్గొన్నారు.

రేపటి నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట-విజయవాడ సెక్షన్‌లో జనవరి 9 వరకు ఇదే పరిస్థితి

కాజీపేట, డిసెంబర్ 23 : దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కాజీపేట– కొండపల్లి (విజయవాడ) రైల్వే స్టేషన్ మధ్యలోని మోటమర్రి రైల్వేస్టేషన్‌లో జరుగనున్న మూ డోలైన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ నెల 25వ తేదీ నుంచి జనవరి 9 వరకు పలు ప్రయాణికుల రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాజీపేట–విజయవాడ, విజయవాడ–కాజీపేట, భద్రాచలం రోడ్డు–విజయవాడ, విజయవా డ–భద్రాచలం రోడ్డు మధ్య నడిచే పుష్‌పుల్ (విజయవాడ ప్యాసింజర్) రైళ్లను జనవరి 9 వరకు రద్దు చేశారు. అదేవిధంగా సికింద్రాబాద్–గుంటూరు, గుంటూరు–సికింద్రాబాద్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 28, 29, జనవరి 2,5,7,8,9 తేదీల్లో, సికింద్రాబాద్–విజయవాడ, విజయవాడ–సికింద్రాబాద్‌ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 27, జనవరి 1,4,7,8,9 తేదీల్లో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ రైళ్ల ద్వారా రాకపోకలు సాగించే ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

- ఏడాది కిందటి హామీలన్నీ నీటి మూటలైనయ్
- సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన మాట ఏమైంది
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- దీక్షకు సంఘీభావం, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా

హనుమకొండలో సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

కాంగ్రెస్‌ది ముమ్మాటికీ పీడించే పాలనే



ఇదేనా ప్రజాపాలన..?

హనుమకొండ, డిసెంబర్ 23 : 420 హామీలు.. 6 గ్యారెంటీలంటూ ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో కోటలు కట్టడమే తప్ప ఏడాది కాలంలో చేసిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నారు.. ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని ప్రజా పీడన పాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండలోని ఏకశిలా పార్కు ఎదుట 2023 సెప్టెంబర్ 13న సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 17రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగుల దీక్షా శిబిరం వద్ద సోమవారం హరీశ్‌రావు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇదే స్థలంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చాయ తాగినంత సేపట్లో రెగ్యులర్ చేస్తానని రేవంత్‌రెడ్డి ఏడాది క్రితం ఇచ్చిన మాట నీటి మూటగానే మిగిలిపోయింది.. సీఎం రేవంత్‌రెడ్డిది నోరా.. మోరా అని ఎద్దేవా చేశారు. కనీసం పిలిచి మాట్లాడే సోయిలేదన్నారు. ఉద్యోగులు హైదరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తే అరెస్ట్ చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, మీ సమస్యపై అసెంబ్లీ నిలదీశామని, శాసనమండలిలో పిటిషన్ కూడా ఇచ్చామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుంది.. మీరు అధైర్యపడకండి అని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.

దీక్షా శిబిరం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ప్లకార్డులతో సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు

సిగ్గులేకుండా గొప్పలు..

బీఆర్ఎస్ పాలనలో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించిన తర్వాత వివిధ కారణాలతో నియామక పత్రాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికే నియామక పత్రాలు అందజేసి తామే ఇచ్చామని సిగ్గూఎగ్గూలేకుండా గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలని హామీ ఇచ్చిన కాంగ్రెస్ 12వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి కేవలం 6వేలు మాత్రమే భర్తీ చేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలకు అసెంబ్లీని వేదికగా మార్చారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పనిముట్లు, స్ప్రింక్లర్లు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని డిప్యూటీ సీఎం అన్నారని అన్న మాజీ మంత్రి మేం రైతులకు ఇవన్నీ ఇవ్వకపోతే రాజీనామా చేస్తా.. మీరు సిద్ధమా భట్టి అని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిందని అసెంబ్లీలో అబద్ధాలు చెప్తే అసెంబ్లీలో తాను రూపాయితో సహా లెక్కలు అప్పజెప్పినట్లు తెలిపారు. బీఆర్ఎస్ చేసింది కేవలం 4 లక్షల 17 వేల కోట్లే అని, మీరు 7 లక్షల కోట్ల అప్పు అని అబద్ధాలు చెప్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు హరీశ్‌రావు చెప్పారు. సర్వశిక్షా అభియాన్‌లో 1,523 ఉద్యోగాలు తామే ఇచ్చామని, మీ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టి, ప్రజల ముందు వారి నిజస్వరూపాన్ని బయట పెట్టాలన్నారు. కేసీఆర్ చేసిన పనులన్నీ మీకు అర్థమవుతుందని, అందుకే నిజం నిలకడ మీద తెలుస్తదన్నారు. ఇవాళ ప్రశ్నిస్తే కేసులు, అడిగితే కేసులు, ప్రజా ప్రభుత్వంలో 7వ గ్యారెంటీ పరిస్థితి ఇవాళ రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. సినీ హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేసినవు సరే, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన నీ సోదరుడు తిరుపతిరెడ్డిని కూడా అరెస్టు చేయాలికదా ఎందుకు అరెస్టు చేయించడం లేదని ప్రశ్నించారు. చట్టం కాంగ్రెస్ పార్టీకి చుట్టమైందా? 54మంది హాస్టల్ విద్యార్థులు మరణిస్తే పట్టించుకోవడం లేదని ఇది ప్రజాపాలనా? లగచర్ల రైతులకు బేడీలు వేస్తే.. ఇది ప్రజాపాలనా? సీఎం రేవంత్‌రెడ్డి నువ్వు మనిషివైతే, మాట మీద నిలబడితే, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజావైద్యంపై ఇంత నిర్లక్ష్యమా?

- సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనుల్లో ఏదీ పురోగతి
- 16శాతం పనులు పూర్తి చేయలేని ప్రభుత్వం
- కాంగ్రెస్ పాలనలో క్రైం రేటులో మాత్రమే మెరుగుపడ్డాం

మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, నాయకులు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 23 : పేదల వైద్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని హరీశ్‌రావు అన్నారు. సోమవారం వరంగల్‌లో పర్యటించిన ఆయన బీఆర్ఎస్ హయాంలో రూ.1100 కోట్లతో సెంట్రల్ జైలు స్థలంలో తలపెట్టిన మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మాణాన్ని పరిశీలించారు. భవనంలో కలియదిరిగి పనుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేసీఆర్ సర్కారు నిధులు వెచ్చించి వరంగల్‌కు తలమానికంగా ఉండేలా హెల్త్‌సిటీకి శ్రీకారం చుట్టారని చెప్పారు. 150 పడకలతో ఎమర్జెన్సీ వైద్య సేవలు, రెండు వేల పడకల సామర్థ్యం, 33 ఆపరేషన్ థియేటర్లు, 14 అంతస్తుల్లో వైద్యం సేవలు అందించడంతో పాటు మిగితా పది అంతస్తుల్లో పరిపాలనా విభాగం, పీజీ వైద్యులకు వసతి, ల్యాబ్‌లు, లైబ్రరీలు, బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు వీలుగా నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. తొలుత 16 లక్షల 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు కొనసాగుతున్న క్రమంలో హాస్పిటల్‌ను సందర్శించిన కేసీఆర్ పలు సూచనలు చేసి సుమారు 20 లక్షల 50వేల చదరపు అడుగులకు పెంచేలా సూచనలు చేయగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 84శాతం పనులు పూర్తి అయ్యాయని హరీశ్‌రావు తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలన రావడంతో హాస్పిటల్ పనులు నత్తనడకన కొనసాగిస్తున్నారని సుమారు 14 నెలలు గడిచినా 16శాతం పనులు పూర్తి చేయలేకపోయారని, ఇది వారి చిత్తశుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. అయితే హాస్పిటల్ నిర్మాణం పూర్తయ్యితే బీఆర్ఎస్ ప్రభుత్వానికి, కేసీఆర్‌కు పేరొస్తుందన్న అక్కసుతో ఉన్న రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. అలాగే ఎంజీఎంలో నిత్యం విద్యుత్ అంతరాయం, యంత్రాలు పనిచేయకపోవడం, మందులు లేకపోవడం, రోగులను ఎలుకలు కరవడం, వైద్య సేవల్లో ఇబ్బందులు..ఇలా ఘటనలు తరచూ సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వస్తున్నా ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా హాస్పిటల్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తొక్కుకుంటూ వచ్చినోళ్లు నిలబడరు..

కార్యకర్తలను, నాయకులను తొక్కుకుంటూ వచ్చిన నాయకుడు నిలదొక్కుకోలేడని హరీశ్‌రావు అన్నారు. తరాల నుంచి కాంగ్రెస్‌లో ఉన్న నాయకులను తొక్కుకుంటూ వచ్చిన రేవంత్‌రెడ్డి తెలంగాణ పేదల సంక్షేమాన్ని సైతం తొక్కేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన రైతుబంధు, దళిత బంధు, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్లు, ఉచిత చేపపిల్లల పంపిణీ లాంటి సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రజలను సైతం తొక్కేస్తున్నాడని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు నిప్పుల కుంపటిగా మారిందన్నారు. అన్నింటా వెనుకబడుతున్నా నేరాల్లో మాత్రం 41శాతం వృద్ధి సాధించినట్లు గణాంకాలు చెబుతున్నాయని, పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు.

కూలికి వెళ్తే చితకబాదిన ఎస్సై

గిరిజన యువకులు రాజు, రవి, జీపీ నుంచి తీసుకున్న అనుమతి రసీదు

- అకారణంగా కులం పేరుతో దూషించాడని గిరిజన కూలీల ఆరోపణ
- న్యాయం కోసం జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన బాధితులు

నల్లబెల్లి, డిసెంబర్ 23 : పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తే విచారణ పేరుతో ఠాణాకు రప్పించి ఎస్సై గోవర్ధన్ చితకబాదిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లిలో వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన వక్కల వెంకటేశ్ అదే గ్రామానికి చెందిన అబ్బు సంజీవరెడ్డి దగ్గర 23 గుంటల భూమిని 2019లో కొనుగోలు చేశాడు. ఆ భూమిని చదును చేసి, అందులో ఉన్న అక్కరకు రాని చెట్లు, పొదలను తొలగించేందుకు గ్రామ పంచాయతీకి డబ్బులు చెల్లించి రసీదు తీసుకున్నాడు. వెంకటేశ్ చెప్పడంతో గుగులోత్ రాజు, గుగులోత్ రవి ఈ నెల 18న కూలికి వెళ్లి చెట్లను తొలగించారు. అయితే, ఈ భూమిపై తౌటిరెడ్డి రాజిరెడ్డి, వెంకటేశ్‌కు మధ్య భూవివాదం ఉంది. దీంతో తన భూమిలో చెట్లను నరికి వేశారని వెంకటేశ్‌తో పాటు గిరిజన కూలీలపై రాజిరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ పేరుతో ఎస్సై గోవర్ధన్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కులం పేరుతో దూషిస్తూ చిత కబాదాడని రాజు, రవి తెలిపారు. అంతేగాక ఓ తెల్లపేపర్‌పై ఇట్లు అని రాసి ఇద్దరి సంతకాలు తీసుకొని, తాను ఎప్పుడు పిలిస్తే అప్పుడు పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకుం జారీ చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం కోసం జాతీయ ఎస్టీ కమిషన్, షెడ్యూల్డ్ ట్రైబ్స్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గిరిజన యువకులు తెలిపారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రాస్తారోకో చేస్తున్న ఆదివాసీలు

సీఆర్‌టీలుగా ఆదివాసులనే నియమించాలి

- జనరల్ నోటిఫికేషన్ రద్దు చేయాలి
- తుడుందెబ్బ ఆధర్యంలో ఐటీడీఏ భవనం ఎక్కి నిరసన

ఏటూరునాగారం, డిసెంబర్ 23: సీఆర్‌టీలుగా ఆదివాసీ అభ్యర్థులనే నియమించాలని, జనరల్ నోటిఫికేషన్ రద్దు చేయాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. వై జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయ భవనంపైకి ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ.. మంత్రి సీతక్క కంచుకోటలో గిరిజనులకు వ్యతిరేకంగా ఐటీడీఏలో అధికారుల పాలన నడుస్తున్నదని అన్నారు. మంత్రి వెంటనే స్పందించాలని కోరారు. ఏజెన్సీలో స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలోని 29 శాఖల్లో రిజర్వేషన్ అమలు చేసేలా ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. వార్డెన్ల నుంచి కమిషన్ తీసుకుంటున్న డీడీ పోచంను సస్పెండ్ చేయాలన్నారు. గిరి వికాస్ కింద బోర్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలన్నారు. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 30న పెద్ద ఎత్తున ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు పొడెంబాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్, ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పాయం అనిత, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోశ్, పీ కోటేశ్వర్‌రావు, కుంజ మహేశ్, ఆయా సంఘాల నాయకులు వంక నరేశ్, గుండ్ల పాపారావు, చేల శమంతకమణి, ఈసం స్వరూప, బడే సులోచన, కొమురం వెంకటేశ్వర్లు, ఆలం నగేశ్ పాల్గొన్నారు.

ఐటీడీఏ భవనమెక్కి నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

వీసీ చాంబర్‌లో విద్యార్థుల ఆమరణ నిరాహారదీక్ష

ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులు నరేశ్, తిరుపతినాయక్, అనిల్

కేయూలో పీహెచ్‌డీ అక్రమాలపై ఆందోళన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 23: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు వచ్చే వరకు దీక్ష విరమించమంటూ వీసీ ప్రతాప్‌రెడ్డి చాంబర్‌లో బైఠాయించి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో కేయూలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని నివారించారు. వీసీ చాంబర్‌లో బైఠాయించిన వారు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీలో పీహెచ్‌డీ అభ్యర్థులకు అడ్మిషన్లు రాకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సప్లిమెంటరీ నోటిఫికేషన్ లేకుండా పీహెచ్‌డీ అభ్యర్థులకు అన్యాయం చేశారని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని పీహెచ్‌డీ విద్యార్థులు మంద నరేశ్, మాలోత్ తిరుపతి నాయక్, సురపాక అనిల్ డిమాండ్ చేశారు.

మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నోడల్ ఆఫీసర్‌గా కిషోర్‌కుమార్

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 23: వరంగల్‌లోని మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు వైద్య, ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌కు నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, ఆర్అండ్‌బీ, టీజీఎంఎస్ఐడీసీ అధికారులతో కలిసి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.